
# నీ అంతు చూస్తా

-కాకాని చక్రపాణి



"అమ్మ! తప్పుడు కొడుకూ?" అన్నాడు రామనాధం ఉన్నట్టుండి.

నీరవంగా ఉంది వాతావరణం. పల్చటి ఎండ. 'ఇండియాలో అయితే తీరుబడే ఉండదు. పొద్దుటి నుంచీ సాయంత్రందాకా టివిలో సీరియళ్ళు. కరెంటు పోయినప్పుడు, బోరుకొడ్తూంటే రోడ్డువైపు చూస్తూ అయినా గడపవచ్చు. వచ్చే పోయే జనంతో వీధులు రావంధాళిగా ఉంటాయి. ఇక్కడ పురుగే కన్పించదు. ఏం అమెరికానో, ఏంటో! పేరు గొప్ప, ఊరు దిబ్బ!' అని ఆలోచిస్తున్న అనసూయ ఉలిక్కిపడింది.

"ఎవరూ?" అనడిగింది భర్తని.

"ఇంకెవరూ- మీ నాయన! నాకివ్వాల్సిన ఐదొందలూ ఎగ్గొట్టి చచ్చాడు ముసలాడు!"

"నువ్వా ముసలాడివయ్యావు! మా చెల్లెళ్ళ మొగుళ్ళని మా నాయన అల్లుళ్ళనేవాడు. నీ ప్రస్తావన వస్తే మాత్రం 'జామాత' అనేవాడు. ఎందుకనో అనుకునేదాన్ని. ఆ తర్వాత తెల్సింది".

"ఏం తెల్సింది?"

"జామాత అంటే దశమగ్రహం. ఈ గ్రహం శని గ్రహం కంటె కూడా ప్రమాదకరమైందని ఆయన అభిప్రాయం. ఆమాట పైకి అంటే నేనెక్కడ నొచ్చుకుంటానో అని 'అల్లుడ'నకుండా 'జామాత' అని మనసులోని కసి తీర్చుకునేవాడు."

"అమ్మ కొడుకూ! అంత కుళ్ళు పెట్టుకున్నాడన్నమాట కడుపులో."

"మీదే కుళ్ళు వంశం. మీ అమ్మంత కుళ్ళు మనిషి మరొకళ్ళు లేరు."

"ఛంపేస్తాను, మా వాళ్ళనేమన్నా అన్నావంటే."

"ఇప్పుడు నేను బతికున్నాను కనుకనా- నువ్వు చంపటానికి. మా నాయన అమ్మతో చెప్పుకుని ఏడ్చేవాడు - ఆ త్రాష్టుడికిచ్చి పిల్ల బతుకు నాశనం చేశానే. కట్టెనా, కంపనా కాలని మనిషి! అత్తిల్లంటే కత్తులబోనే అయింది దానికి! అమ్మో, ఆ మనిషిది నోరా! డ్రైనేజీ కాలువ! వాడి నోట్లో నోరు పెట్టే బుద్ధితక్కువ వెధవ మరొకడుండడు- అని గుండెలు బాదుకునేవాడు. పెళ్ళిలో మీరు చేసిన జాతర చూసి - 'నా కూతుర్ని కాపరానికి కాదు, కాటికి పంపించాను' అని ఏడ్చాడు, పాపం, ఆయన! చచ్చి ఏ లోకానున్నాడో?"

"ఇంకెక్కడ- నరకంలో! అల్లుడిని పట్టుకుని అంతలేసి మాటలన్నవాడు మరెక్కడుంటాడు! నేను కట్టెనా, కంపనా కాలనా? నా నోరు డ్రైనేజీ కాలువా? అమ్మో. ఇంతలేసి మాటలు కూశాడని బతికున్నప్పుడు తెలిసుండెనా, ముసలాడికి బుద్ధి వచ్చేట్టు చేసేవాడిని."

"ఏం చేసేవాడివి?"

"నీకు విడాకులిచ్చేవాడిని, మీ నాయనకు బుద్ధి వచ్చేది."

"ముంచుకు పోయింది ఏముంది, ఇప్పుడివ్వు."

"మీ నాయన చచ్చాడుగా, ప్రయోజనమేముంది?"

"అసలు సంగతి అది కాదు. ఊడిగం చెయ్యటానికి - నీకూ, మీ అమ్మానాయనలకూ- నాలాంటి అమాయకపుది దొరకదని ఉంచుకున్నావు! అమ్మో, మీ అమ్మ- ఆవిడని తల్చుకుంటేనే నాకు కంపరమవుతుంది. అప్పుడు పెద్దవాడిని కని నెల రోజులు కూడ కాలేదు. ఇంటి చాకిరీ అంతా నాపైనే పెట్టేసింది. పైగా అది చెయ్యలేదు, ఇది చెయ్యలేదు అని సతాయింపు! వెర్రి మొహం దానిని! ఇప్పటి తెలివితేటలు అప్పుడు లేవు..."

"ఉంటే ఏం చేసేదానివేం?"

"ఆవిడ సంగతేదో తేల్చేదాన్ని!"

"ఎట్లా? ఇప్పుడు నీ పెద్ద కోడలు నీ సంగతి తేల్చినట్టా! అందుకేగా ఆర్నెల్లయినా ఇక్కడ చిన్నాడి దగ్గర గడుపుదామని వచ్చింది."

"అత్త పెట్టే ఆరళ్ళు కనపడతాయి గానీ, కోడలు చేసే కొంటె పనులు కనపడవు. దాని ప్రస్తావన నా దగ్గర చెయ్యొద్దు. నేను దాన్ని అమ్మలాగా ఆదరించాను. దానికే నా ప్రేమ ఎక్కసమైపోయింది. ఈ విషయంలో నాకూ, మీ అమ్మకూ పోలికా! మీ అమ్మ అచ్చు సూర్యకాంతమే."

"నువ్వు శ్రీరంజనివి! చెప్పకు. అసలు లోపం నీలోనే ఉంది. నీకటు అత్తతోనూ పడలేదు, ఇటు కోడలితోనూ పడలేదు..."

"ఎట్లా పడుతుంది- మనుషులు దుర్మార్గులయితేను! నా బతుకు నరకమైపోయింది, ఏం పాపం చేసుకున్నానో క్రిందటి జన్మలో- నీలాంటి మొగుడు, మీ అమ్మలాంటి అత్తా, ఆ శాకిని కోడలుగా దొరకటానికి... " అని కళ్ళ నీళ్ళు పెట్టుకుంది అనసూయ.

భార్య కంటి నీరు చూసిన రామనాధం మారు మాట్లాడలేదు. అతని హృదయం తరుక్కుపోయింది. ఇప్పుడేం మాట్లాడినా కరిచేస్తుంది. అతనికి అనుభవమే. మరోమాట మాట్లాడకుండా, టివి ఆన్ చేశాడు ఏదో పాడు డాన్సులు, పాటలు వస్తున్నాయి. ఇక్కడి వాడికేం మాయరోగమో- ఇండియా ప్రసారాలు చూపించడు. కొడుకు ప్రయత్నించాడు. ప్రయోజనం లేకపోయింది. చికాగోకి రెండొందల మైళ్ళ దూరం. అక్కడికీ కొడుకు ఓ వీకెండ్‌కి చికాగో అరోరాలో కట్టించిన బాలాజీ గుడికి తీసుకెళ్ళాడు. ఎంత ప్రశాంతంగా ఉంది గుడి! ఎడమ వైపున్న వినాయకుడికి, వల్లీ-నాయకీ సమేత సుబ్రహ్మణ్యస్వామికి, కుడి వైపున్న మల్లికార్జునస్వామి, భ్రమరాంబలకు మొక్కి, నవగ్రహాలను శాంతింప చేయటానికి ప్రదక్షిణలు చేసి వెంకటేశ్వరుడి గుడిలోకి వెళ్ళారు... ఏం పూలు! ఏం అలంకరణ! మన దేశంలో అలాచేయాలన్న మనకా టేస్టెక్కడిది! ఓసారి న్యూయార్క్ తీసుకెళ్తానన్నాడు. ఏం తోచి చావటంలేదు ఈ పాడు అమెరికాకంటే ఇండియానే బెటరు! పన్నెండు గంటలయినట్టుంది. ఈపాటికి జెమినీలో మంచి సీరియల్ వచ్చేది. ఈ టీవీలోను మంచి సీరియలే. తాము ఇక్కడికి వచ్చేముందు ఏం సీరియల్ వస్తుండేదబ్బా!

"అత్త పెట్టే ఆరళ్ళు కనపడతాయి గానీ, కోడలు చేసే కొంటె పనులు కనపడవు. దాని ప్రస్తావన నా దగ్గర చెయ్యొద్దు. నేను దాన్ని అమ్మలాగా ఆదరించను. దానికే నా ప్రేమ ఎక్కసమైపోయింది. ఈ విషయంలో నాకూ, మీ అమ్మకూ పోలికా! మీ అమ్మ అచ్చు సూర్యకాంతమే."

-ఆలోచనలో పడిపోయాడు రామనాథం. వెంటనే స్ఫురించలేదతనికి!

"ఇదుగో, నిన్నే! మనం అమెరికా వచ్చేముందు ఏ సీరియళ్ళు వస్తుండేవి టివిలో?"

"ఒట్టి మతిమరుపు మనిషివి! టివి తెరిచి మొహం అతికించేసుకుని చూసేవాడివి, ఆ మాత్రం గుర్తులేదూ?"

"నువ్వూ చూసే దానివే, నన్ను అనటానికి మాత్రం తయారు!"

"అసలు ఇవాళ ఇంతదాకా గిల్లికజ్జాలు పెట్టుకుంది ఎవరు?"

"నువ్వే"

"నేను కాదు నువ్వే."

"ముమ్మాటికీ నువ్వే!"

"వందసార్లకూ నువ్వే!"

"ఎంత పొగరే నీకు- మొగుడంటే లక్ష్యం లేదు!"

"నీకుందా పెళ్ళామంటే లక్ష్యం!"

"ఛీ! నీతో మాట్లాడటమంత బుద్ధి తక్కువతనం మరోటి లేదు.

* * *

"మొన్నామధ్య మీ నాయన్ని అన్నానని నీకు కోపమొచ్చింది గాని, ఆయన చేసిన దురాగతం మాత్రం నీకు గుర్తులేదు!" అన్నాడు రామనాథం భోజనం చేస్తూ.

"ఏవిటో అది?"

"పెళ్ళప్పుడు సైకిలు కొనిపెడతానన్నాడు. అప్పుడెంత! ముష్టి ఐదొందలు! పిసినారి మనిషి- ఇవ్వలేని వాగ్దానాలు చెయ్యటమెందుకూ?"

"అలిగి కూర్చుని అప్పగింతలకు రాకపోతే ఏం చేస్తాడాయన! కార్యం నాడు తల వంచుకుంటే కలకాలం తలెత్తి తిరగొచ్చన్నారు. నీకు సరే, మీ నాయనకూ బుద్ధిలేదు. కొడుకు అలిగితే నచ్చ చెప్పాల్సింది పోయి- పిల్లవాడు ముచ్చటపడుతున్నాడు. కారడిగాడా, రైలుబండి అడిగాడా? బోడి సైకిలేగా- అని సన్నాయి నొక్కులు..."

"పెళ్ళన్నాక ఎవరయినా సరదా పడతారు."

"మరి మన పెద్దల్లుడి ముచ్చట కూడా తీర్చలేకపోయావూ? అతగాడు స్కూటరడిగితే- మనం మాట్లాడుకున్నప్పుడు అది ప్రస్తావనకు రాలేదు- అని కరాఖండీగా చెప్పేశావు! 'ఏంటే, అమ్మా! నాన్న అంత మొహమాటం లేకుండా చెప్పేస్తాడు'అని అమ్మడు నా దగ్గర మొత్తుకునేది."

"రెండు లక్షల కట్నం వాడి మొహాన పోశారు. ఇకెక్కడ తేనూ?"

'మా నాయనా నీ ఎదాన మూడు వేలు పోశాడు. ఆ రోజుల్లో మూడు వేలంటే పది లక్షలు! పాపం! స్కూలు టీచరు - ఎక్కడనుండి తెస్తాడు! నా తర్వాత ఇంకా ఆయనకు ఇద్దరు ఆడ పిల్లలున్నారు. తమ్ముడింకా చిన్నపిల్లాడే. నీకివ్వాల్సింది ముద్ర శుద్ధిగా ఇచ్చేశాక కూడా, ఇంకా సైకిలివ్వలేదు అని అడిగితే ఆయనేం చేస్తాడు! అప్పటికా గండం గడవటానికి తర్వాతెలాగో ఇస్తానని చెప్పాడు...."

"మాట నిలబెట్టుకుంటే నేను ఆ ప్రస్తావన తేవాల్సిన అవసరం ఉండేది కాదు. మాట తప్పే మనుషులంటే నాకు మహా చిరాకు.

"నిజానికి మాట తప్పే వంశం మాది కాదు. మాట తప్పేట్టు చేసింది మీరే. అనుకున్నట్టు అన్నీ పెట్టారు. అదనపు కోరికలు కోరితే ఎదుటి మనిషికి తాహతు ఉండొద్దూ?"

"మాట ఇచ్చేటప్పుడు తాహతు చూసుకోవాలి."

"మరి చిన్నది ఇల్లు కట్టుకుంటుంటే లక్ష రూపాయలు సాయం చేస్తానన్నావు! మాట నిలబెట్టుకున్నావా?"

"అప్పుడేగా చిన్నాడు అమెరికా వచ్చింది. దూరాభారం- పిల్లవాడిని వట్టి చేతుల్తో ఏం పంపుతాం. అప్పుడు పంపాం కనకే ఇప్పుడు సంపాదిస్తున్నాడు. మనమూ రాగలిగాం. అందుకనే అప్పుడు చిన్నదానికి సాయం చెయ్యలేక పోయాను. వెసులుబాటు చూసుకుని పంపిస్తే, సొడ్డాబ్బంది అల్లుడు గిల్లుడికి- సమయానికి చెయ్యని సాయం తనకక్కర్లేదంటూ తిరస్కరించాడు. నేను మాట తప్పలేదు."



"నువ్వే కాదు సంసార భారం మోసింది- మా నాయనమా డబ్బు అందక తిప్పలు పడేవాడు. ముగ్గురు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేశాడు- తినో తినకో. ఆ రోజుల్లో అదే గొప్ప! నువ్వయితే కళ్ళు తేలేసేవాడివి!"

"మా నాయనా మాట తప్పలేదు. సైకిలు కొనివ్వలేదన్న కోపంతో పదేళ్ళు నా పుట్టింటి మొహం చూడనిచ్చావా? మా చెల్లెళ్ళ పెళ్ళిళ్లయినా పోనివ్వలేదు. కర్కోటకుడివి! నీకు మీ అమ్మ వంతపాట! అప్పుడయినా మీ నాయన పోయినప్పుడు ఆదరింపులకొచ్చిన మా అమ్మా, నాన్నలను చూడగలిగాను. నీ సైకిలు డబ్బూ నీకు ముట్టచెప్పారు..."

"ఏం ముట్టచెప్పాడు! బోడి ఐదొందలిచ్చాడు. పదేళ్ళలో సైకిలు ధర రెట్టింపయింది. ఆ మాటంటే ఏమన్నాడూ మీ నాయన- బాబ్బాబూ! చేతిలో డబ్బాడటం లేదు. వీలు చూసుకుని తక్కిన ఐదొందలూ పంపిస్తా. నువ్వు కొనుక్కో ముందు- అన్నాడు."

"మరి కొనుక్కోలేకపోయావూ?"

"సంసారంలో గొంతు లోతు దింపావు. సైకిలు కొనక్కునే వెసులుబాటు మిగల్చావా నువ్వు!"

"నువ్వే కాదు సంసార భారం మోసింది- మా నాయనా డబ్బు అందక తిప్పలు పడేవాడు. ముగ్గురు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేశాడు- తినో తినకో, ఆ రోజుల్లో అదే గొప్ప! నువ్వయితే కళ్ళు తేలేసేవాడివి!"

"అదేం మాట! నేనూ ఇద్దరి కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేశాను."

"చేశావులే గొప్ప. పెద్ద దాన్ని మా తమ్ముడికే ఇచ్చావు! చిన్నదాని పెళ్ళొక్కటేగా పరాయి సంబంధం నువ్వు చేసింది!"

"నీ తమ్ముడేం నా కూతుర్ని ఊర్కే చేసుకోలేదు. నేనేం మీ నాయనలాగా డబ్బు ఎగ్గొట్టలేదు."

"ఆ మాటనకు, పురుగులబడి పోతావు!"

"ఎంత పొగరే నీకు! మొగుణ్ణి పట్టుకుని పురుగులబడి పోవాలంటావా?" అంటూ తింటున్న పళ్ళెం విసిరికొట్టి లేచి వెళ్ళిపోయాడు రామనాథం ఆగ్రహంతో.

అనసూయ అతని కోపాన్ని చూసి అవాక్కై నిలబడిపోయింది. 'మనిషికి ఇదివరకు ఇంత కోపం లేదు. వయసుడిగి బలహీనంతో కస్సుమని పోతున్నాడు. ఈ దరిద్రపు అమెరికా వచ్చాక, పాపం మనిషికి పొద్దుపోవటం లేదు. హైదరాబాదులో ఉన్నప్పుడు స్నేహితులంటూ ఊరట్టుకు తిరిగేవాడు. తన్నొక్కమాట అన్నది లేదు. టివి సీరియళ్ళతో తమకు పొద్దుపోయేది. పాపం! కాలక్షేపం లేకనే మనిషిలా తయారయాడు!" అనుకుంది అనసూయ.

* * *

"నీ గోల నీదే! పెళ్ళయి పదిహేనేళ్ళయినా నా సైకిలు బాపతు ఐదొందలు ఇవ్వలేదని గోల పెట్టావు!" అంది అనసూయ.

"నేను ఖచ్చితమైన మనిషిని. నేను బాకీ పడినా ఉంచుకోను. ఇతరులు ఎగ్గొడితే సహించలేను."

"ఆయన నీకేం బాకీ! పొరపాటున పెళ్ళప్పుడు సైకిలు కొనిస్తానన్నాడు. నువ్వు ఒదల్లేదు. నీ గోల భరించలేక, చిన్నది పుట్టినప్పుడు, ఆయన పాపం తన చేతి ఉంగరం అమ్మి, నీకు ఆ ఐదొందలూ ముట్టచెప్పాడు. అయినా నువ్వు ఆయన్ని సాధించటం మానలేదు."

"బావుంది! పదిహేనేళ్ళకు సైకిలు ధర రెండువేలకు దాటింది. రెండు ఇన్‌స్టాల్‌మెంట్లలో ఐదొందలు చొప్పున ఇస్తే, నాకు సైకిలు వచ్చినట్టేనా? వెయ్యి రూపాయలు బాకీ పడిపోయాడు..."

"నీ గడుసుదనం తెల్సే, నన్నింకా ఏం రంపపుకోత పెడ్తావోనని పెద్దదాన్ని తన కొడుక్కి చేసుకోటానికి ఒప్పుకున్నాడు మా నాయన! అందుకయినా కృతజ్ఞత ఉండాలి."

"ఊర్కే చేసుకున్నాడా? అది ఉద్యోగం చేస్తున్నది. అప్పుడే పదివేలు సంపాదిస్తున్నది. సంపాదించే కోడలు వస్తూందని ఒప్పుకున్నాడు కానీ, నామీద దయతల్చి కాదు."

"మా తమ్ముడి ఒడుక్కి వచ్చిన నీకు సైకిలు బాపతు వెయ్యూ ఇచ్చాడు. అయినా నీకు తృప్తి కలగలేదు. సైకిలు ధర రెండువేల ఐదొందలు పెరిగిందని చెప్పి మరో ఐదొందలివ్వమన్నావు. మా నాన్నకర్థమైపోయింది. సీరియల్‌గా తీర్చినా ఈ బాకీ తీరేది కాదని! అందుకే నీ కూతుర్ని కొడుక్కు చేసుకున్నాడు- కొడుకయినా నక్షత్రకుడిలా నీవెంట పడి నీకు బుద్ధి చెప్తాడేమోనని! కానీ, నిన్ను వంచటం మా తమ్ముడి వల్ల కాలేదు. వాడు స్కూటరుకు డబ్బు అడిగితే నిర్మొహమాటంగా లేదని చెప్పావు! నువ్వు కట్టినా కంపనా కాలనని ఊర్కే అనలేదు ఆయన. నీ బుద్ధి తెలిసే అన్నాడు."

"ఏంటీ నా బుద్ధి! అట్లా ఇతర్ల డబ్బు ఎగ్గొట్టే మనిషి కాబట్టే మీ నాయన కాన్సరుతో తీసుకుపోయాడు."

"మీ అమ్మ బ్రెయిను హామరే వచ్చి పోలా? మమ్మల్ని ఉసురు పెట్టే ఊరికే పోదు."

"ఛీ, ఫో! నీతో మాట్లాడటం నాది బుద్ధి తక్కువ!"

"ఇన్నేళ్ళ కాపురంలో ఏడవని రోజంటూ లేదు నాకు" అంటూ అతి కష్టంమీద లేచి, "ఈ బతుక్కు ఇదోటి, కీళ్ళ జబ్బు! బతుకంతా నీకు చాకిరీ చేసినందుకు నాకు మిగిలిందిదే" అని కుంటుకుంటూ లోపలికి పోయింది అనసూయ.

(మిగతా 19వ పేజీలో)


# సైన్స్ టిప్

-సి.వి.సర్వేశ్వర శర్మ

## సప్త వర్ణాల రంగులు కలిపితే నలుపు రంగు వస్తుందేమిటి?

కాంతి నిరోధక పదార్థాల రంగుల గురించి కాంతి పరావర్తనం, ఎంపిక కాంతి శోషణం ద్వారా వివరించాలి. సాధారణంగా ఇటువంటి అనుభవం రంగులు, పెయింట్స్‌తో కల్గుతుంది. ముందుగా అసలు 'తెలుపు', 'నలుపు' రంగులు అంటే ఏమిటో తెలుసుకుందాం.

సప్త దృశ్య వర్ణాల కలయిక తెలుపు రంగు అని మనందరికి తెలుసు. ఒక కాంతి నిరోధక పదార్థం ఈ సప్త వర్ణాలను పరావర్తనం చెందిస్తే వాటి సమ్మేళనం మనకు తెలుపు రంగుగా కన్పిస్తుంది.



ఈ సప్త వర్ణాల కాంతి తరంగాలను బలహీనంగా పదార్థం పరావర్తనం చెందిస్తే వాటి కలయిక బూడిద రంగులో కన్పిస్తుంది. బూడిద రంగు మరీ ఎక్కువగా ఉంటే అది నలుపు రంగుగా కన్పిస్తుంది.

నల్లటి తలం దాని మీద పడిన కాంతిలోని అన్ని రంగులను శోషణం చెందించుకుంటుంది. ఏ రంగు కాంతిని పరావర్తనం చెందించదు. నిజానికి పరిపూర్ణమైన నలుపు తలం అనేది ఏదీ లేదు. ఒక కాంతి నిరోధక పదార్థంపై తెల్లని కాంతి పతనం చెందినపుడు అది అందులోని కొన్ని రంగులను పీల్చుకుని మిగిలిన రంగులను పరావర్తనం చెందిస్తే ఆ రంగులను మాత్రం మనం చూడగల్గుతాము.

ఎర్ర గులాబి పువ్వు మీద తెల్లని కాంతి పడినపుడు, ఆ గులాబీ తెల్లని కాంతిలోకి ఊదా, నీలం, ఆకుపచ్చ, పసుపుపచ్చ రంగులను పీల్చేసుకుంటుంది. ఎరుపు రంగును మాత్రం పరావర్తనం చెందిస్తుంది. నీలం రాయి మీద తెల్లని కాంతి పడినపుడు, రాయి అన్ని రంగులను శోషణం చెందించుకుని నీలం రంగును పరావర్తనం చెందిస్తుంది. అందువల్ల రాయి నీలంగా కన్పిస్తుంది.

కాంతి నిరోధక పదార్థంపై ఏ రంగు పూత ఉంటుందో ఆ పదార్థం ఆ రంగులో కన్పిస్తుంది. రంగులు అనేవి సూక్ష్మమైన కణాలతో కూడిన పదార్థాలు. ఇవి తెల్లని కాంతిలో ఉండే ఏడు రంగులలో కొన్నింటిని పీల్చుకుని మరి కొన్నింటిని పరావర్తనం చెందిస్తాయి. పసుపు రంగు పూత తెల్లని కాంతిలోని ఊదా, నీలి రంగు కాంతుల్ని పూర్తిగా శోషణం చెందించుకుంటుంది. కొద్ది ఆకుపచ్చ, ఎరుపు రంగులను పసుపు రంగుకు తోడుగా పరావర్తనం చెందిస్తుంది.

నీలి రంగు పూత తెల్లని కాంతిలోని ఎరుపు, పసుపు రంగు కాంతులను పూర్తిగా శోషణం చెందించుకుని నీలి రంగుకు తోడుగా కొద్ది ఆకుపచ్చ, ఊదా రంగులను పరావర్తనం చెందిస్తుంది. పసుపు రంగు, నీలి రంగులను మిశ్రమం చేసి దాని మీద తెల్లని కాంతిని పతనం చెందించినపుడు ఒక్కొక్క రంగు రెండవ రంగు పరావర్తనం చెందించే కాంతిని శోషణం చేసేందుకు తయారుగా ఉంటుంది. అయితే ఈ రంగుల మిశ్రమం ఆకుపచ్చ రంగును పూర్తిగా శోషణం చెందించుకోదు. అందుకే పసుపు, నీలి రంగుల మిశ్రమం ఆకుపచ్చగా కన్పిస్తుంది. అన్ని రంగులు మిశ్రమం చేసినపుడు అవి బూడిద వర్ణంలో కన్పిస్తాయి. మిశ్రమం తెల్లని కాంతిని బాగా బలహీనంగా పరావర్తనం చెందించడంతో నల్లగా కన్పిస్తుంది. ★

**సప్త వర్ణాల కాంతి తరంగాలను బలహీనంగా పదార్థం పరావర్తనం చెందిస్తే వాటి కలయిక బూడిద రంగులో కన్పిస్తుంది. బూడిద రంగు మరీ ఎక్కువగా ఉంటే అది నలుపు రంగుగా కన్పిస్తుంది.**

---

(9వ పేజీ తరువాయి)

"ఓ కాఫీ తగలెట్టు, అట్లా వీధుల్లో తిరిగొస్తా, పొద్దుపోయి చావటం లేదు"

"నావల్ల కాదు. ఇప్పటికి అరడజను కప్పులు తాగావు. బయటికి కెళ్తున్నావుగా అక్కడెక్కడయినా తాగు" అంది అనసూయ విసురుగా లోపలి నుండి.

* * *

చిన్న కోడలు గర్భవతి అయిందని తెలిశాక, పురిటికి ఆమె తల్లీదండ్రీ అమెరికా వెళ్ళారు. ఇండియాలో కూతుళ్ళను కాన్పుకు పుట్టింటికి తీసుకెళ్తారు, అమెరికా అయితే కన్నవారే వెళ్తారు. అమెరికాలో కంటే పుట్టే పిల్లలు అమెరికా పౌరులవుతారట. వాళ్ళువెళ్ళి ఆర్నెల్లు ఉండి కూతుర్ని ఇండియాకు తీసుకెళ్ళారు. కొడుకు ఫోను చేస్తే, "అమెరికా చూసే భాగ్యం మీ మావకు, అత్తకేనా, మాకు లేదా?" అని రామనాథం అడిగితే, "దానికేం భాగ్యం! మీరూ రండి" అని రమణ తల్లీతండ్రీ రావటానికి అన్ని ఏర్పాట్లూ చేశాడు. వచ్చాక వాళ్ళు నెల రోజులు ఉండలేకపోయారు. వారం రోజులుగా తల్లీతండ్రీ ఒకరితోఒకరు మాట్లాడుకోవటం లేదని అర్థమైంది రమణకు. ఓ రోజు రామనాథం కొడుక్కు చెప్పాడు, "నేను హైదరాబాదు వెళ్ళిపోతాను. ఆ ఏర్పాటు చెయ్యి. మీ అమ్మ నీ దగ్గరే ఉంటుంది"అని.

"నన్ను పంపించెయ్యరా! మీ నాన్నని నీ దగ్గరే ఉంచుకో. ఆ ముసలి సణుగుడుతో నేను పడలేకపోతున్నాను" అంది అనసూయ.

"అదుగో ఆ వదరుబోతు తనానికే నీకు విడాకులిస్తాననేది."

రమణకు అర్థమైపోయింది- ఇంక తన తల్లీతండ్రీ అక్కడ ఉండలేరని. ఇద్దరికీ ఫ్లైటు టిక్కెట్లు బుక్‌చేసి వారం రోజుల్లో పంపించేశాడు.

హైదరాబాదు ఎయిర్ పోర్ట్‌లో ఫ్లైటు దిగి బయట పడేటప్పటికి పదకొండు గంటలయింది ఆ వృద్ధ దంపతులకు. అప్పటికే ఎండ మాడ్చేస్తోంది. ఇండియాలోని దుమ్ము-ధూళి, శబ్ద కాలుష్యం, వీధి వాగ్యుద్ధాలు, పెళ్ళిళ్ళూ చూసుకుంటూ, స్వేచ్ఛగా అనుభవిస్తూ ఇంటికొచ్చారు. ఎంతయినా జన్మభూమి. ఇక్కడి మురికయినా, దారిద్ర్యమయినా మన సొంతం. పరాయి భాగ్యం పరాయిదే.

ఇంటికొచ్చి టివి ఆన్ చేశాక, సీరియల్‌లో హీరోయిన్ ప్రత్యర్థిని, "నీ అంతు చూస్తా" అని తర్జనితో బెదిరించటం చూశాక గానీ ఆ దంపతులకు మనసు కుదుట పడలేదు.

"ఇప్పుడు వంటేం చేస్తావు లేవే! వాచ్‌మన్‌ను పంపి హోటలు నుండి కారీర్ తెప్పిస్తాను" అన్నాడు రామనాథం ప్రేమగా భార్యతో.

"అసలే నీ ఆరోగ్యం అంతంత మాత్రం. హోటలు భోజనమెందుకూ? ఇద్దరు మనుషులకు వంటెంత సేపు పడుతుంది" అంది అనసూయ. చిక్కిపోయినట్టు కన్పిస్తున్న మొగుణ్ణి చూస్తూ.

ప్రేమకు ఆలంబనాలు ఎన్నో ఉండాలి. టీవీ సీరియళ్ళ పాత్రని కాదనలేం. అవి లేకపోతే ఎంతోకొంత ఈ దంపతుల్లా కోల్పోక తప్పదు. అవి మన అంతు చూసే అవకాశమూ ఉంది. ★